క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాటా 11, వంకాయ 18, బెండ 35, పచ్చి మిర్చి 40, కాకర 38, బీర 45, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 65, క్యారెట్ 20, దొండ 13–18, చిక్కుడు 55, గోకర 40, బీట్‌రూట్ 20, క్యాప్సికం 45, ఆలు 20, దోస 18, సొర 9, పొట్ల 15, ఉల్లి 12 చామగడ్డ 43. ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

పూడికతీత పనుల పరిశీలన

కాచిగూడ: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా కచ్చామోరీల్లో పూడికతీత పనులను చేపట్టినట్లు గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం డివిజన్‌లోని కృష్ణానగర్ బస్తీలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, అధికారులతో కలిసి ఆమె పూడికతీత పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు.

బీసీ సీఎం పార్టీ అభ్యర్థికే మద్దతు

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎంగా బీసీ అభ్యర్థిని ప్రకటించిన పార్టీకే బీసీల మద్దతు ఉంటుందని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని ఆరోపించారు. బీసీలకు రాజ్యాధికారంలో వాటా దక్కకుండా చేస్తున్నాయని ఓ ప్రకటనలో తెలిపారు. బీసీలను విస్మరించే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించి ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలంతా సంఘటితమై రాజ్యాధికారం దిశగా ఉద్యమించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం'

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పూర్తిస్థాయిలో విజయం సాధించి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి ధీమా వ్యక్తం చేశారు. శనివారం గోల్నాకలో బీజేపీ గుర్తు కమలంతో 'తెలంగాణలో బీజేపీ సర్కార్ అనే స్లోగన్స్'ను గోడలపై ఆమె రాశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవినీతిలో కూరుకుపోయి కుటుంబ పాలన చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కేంద్రం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

రజకుల మహాసభలను జయప్రదం చేయండి

ఉప్పల్: జనగామలో నిర్వహించనున్న రజక వృత్తిదారుల మూడవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం ఉప్పల్‌లో రజక వృత్తి దారుల సంఘం మేడ్చల్– మల్కాజిగిరి ఉప్పల్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 29, 30 తేదీల్లో జనగామ జిల్లాలో జరిగే మహా సభలను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు, ఎస్ సుభద్ర. షట్టు రవి, యాదగిరి పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చడం అభినందనీయం

వనస్థలిపురం: వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీర్చడం అభినందనీయమని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్‌లో బస్టాప్ వద్ద సీనియర్ సిటిజెన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు ఎస్.జ్ఞానేశ్వర్, కార్యదర్శి ఆర్.సూర్యనారాయణ, కేఎల్.నర్సింహారావు, కె.జగన్నాథరావు, డాక్టర్ అప్పారావు, రఘు రామయ్య, బీజీవీ ప్రసాద్, టి.యాదగిరిరావు, సాంబయ్య, గోవిందాచారి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



శారదానగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి


ఈద్ ముబారక్



ఈద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



సరూర్‌నగర్ ఈద్గా వద్ద పార్థనలు చేస్తున్న ముస్లింలు



ఎమ్మెల్యే బలాలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లింలు

- భక్తిశ్రద్ధలతో రంజాన్
- మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింల సామూహిక ప్రార్థనలు
- పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

చైతన్యపురి/మలక్‌పేట/దిల్‌సుఖ్‌నగర్: ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలో ముస్లింలు శనివారం ఈద్–ఉల్–ఫితర్ (రంజాన్) పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చిన్నా.. పెద్దా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

◆ అక్బర్‌బాగ్ డివిజన్ ఉజలేషా ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల , మాదన్నపేట ఈద్గాలో యాకుత్‌పుర ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ, సరూర్‌నగర్ మినీట్యాంక్‌బండ్ వద్ద ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా పాల్గొన్నారు.

◆ మన్సూరాబాద్‌లో జరిగిన ప్రార్థనల్లో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

◆ ఎల్‌బీనగర్ మసీద్‌లో జరిగిన వేడుకల్లో ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి పాల్గొన్నారు.

చాక్లెట్స్ పంచిన రాచకొండ సీపీ...

◆ సరూర్‌నరగ్ ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనలను రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్, డీసీపీ సాయిశ్రీ, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ముస్లిం చిన్నారులకు కమిషనర్ చాక్లెట్లు పంచిపెట్టారు.



సరూర్‌నగర్ ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా



ఎన్‌టీఆర్‌నగర్‌లో ప్రార్థనల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేత దేప భాస్కర్‌రెడ్డి



శుభాకాంక్షలు తెలుపుతున్న హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి



ఉజలేషా ఈద్గా వద్ద ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న సామ రంగారెడ్డి



ఎల్‌బీనగర్‌లో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి



శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్‌ఆర్‌టీపీ నేత మామిడి రాంచందర్



చిన్నారులకు చాక్లెట్స్ పంచుతున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

వైభవంగా అష్టలక్ష్మీ ఆలయ బ్రహ్మోత్సవాలు



పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయ 27వ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 2వ రోజైన శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా మూర్తి కుంభస్థాపన, అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణ, బేరిపూజ, దేవతాహ్వనం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు వేద మంత్రోచ్చరణల మధ్య అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య శేష వాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ఆలయ ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి ఐతే అంజయ్య గుప్తా, బ్రహ్మోత్సవ కమిటీ కన్వీనర్ గౌరిశెట్టి అరుణ్, ధర్మాధికారి జయశంకర్ బాలగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఎదుర్కోలు ఉత్సవం

అష్టలక్ష్మీ ఆలయ బ్రహోత్సవాల్లో భాగంగా ఆదివారం యాగశాలలో పూర్ణాహుతి, ఎదుర్కోలు ఉత్సవం, ఉన్నత విద్యాప్రాప్తికి శ్రీహయగ్రీవేష్టి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: అందరూ ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను కాలనీవాసులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుధాకర్, శ్రీనివాస్ కుమార్, అశోక్‌చారి, సునీత, వాణి, నాయకులు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్చ్ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ఎస్వీ కాలనీ ఆర్చ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని ఎస్వీ కాలనీ ఆర్చ్ పునర్నిర్మాణ పనులకు శనివారం స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాలనీ వాసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఎస్వీ కాలనీ ఆర్చ్‌ను రోడ్డు విస్తరణ కోసమని రహదారి విస్తరణ ప్రాజెక్ట్, సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారన్నారు. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌కు తెలపటంతో నష్టపరిహారంగా ఆర్చ్ పునర్నిర్మాణం కోసం రూ.1.50 లక్షలు మంజూరు చేశారన్నారు. త్వరలో కాలనీలోని అసంపూర్తిగా ఉన్న సంక్షేమ సంఘం భవన నిర్మాణం, కాలనీ అంతర్గత రహదారుల మరమ్మతులు వంటి పనులు చేపడతామని కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు కేశవరెడ్డి, దిలీప్‌రెడ్డి, అమృతా రెడ్డి, నాగేష్‌గౌడ్, సత్తయ్య, సుధాకర్‌రెడ్డి, శ్రీను, నాయకులు సద్ది సందీప్‌రెడ్డి, దశరథగౌడ్, సుంకరి రమేష్‌గౌడ్, శ్రీధర్ పాల్గొన్నారు.

చలివేంద్రాలతో బాటసారులకు ఎంతో మేలు

నాగోలు: వేసవి కాలంలో చలివేంద్రాలు బాటసారులకు ఎంతో ఉపయోగపతాయిని చెర్కు శంకరయ్య గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ చెర్కు ప్రవీణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం నాగోలు చౌరస్తా వద్ద చెర్కు శంకరయ్య గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలి వేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం శంకరయ్యగౌడ్ పేరుతో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలం మొత్తం పాదచారులకు మజ్జిగ, చల్లని నీరు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో చెర్కు జంగయ్యగౌడ్, సందీప్‌రెడ్డి, శివకుమార్‌గౌడ్, చెర్కు ప్రశాంత్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ మధుగౌడ్, షణ్ముఖగౌడ్, కందికంటి కుమార్‌గౌడ్, పేరాల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



నాగోలు ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

మోహన్‌నగర్‌లో...

అక్షయ తృతీయ సందర్భంగా కొత్తపేట డివిజన మోహన్‌నగర్ చౌరస్తాలో ఉపేందర్‌సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ రంగారెడ్డి అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నందికొండ గీతారెడ్డి, నాయకులు మంచి రాజేష్, సుందర్ నారాయణ, అనిల్‌కుమార్, రాకేష్, యాదవ్, ప్రవీణ్, సంగ్రామ్, అక్షయ్‌కుమార్, మోను పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాలకు తలుపులు విరాళం

మీర్‌పేట: ఆలయాభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకే అమ్మవారికి ఆలయాలకు సొంత ఖర్చుతో తలుపులు చేయించి విరాళంగా అందజేశామని తీగల క్రాంతి కిరణ్‌రెడ్డి, ప్రవంతి దంపతులు అన్నారు. మీర్‌పేట ఓల్డ్ విలేజ్‌లోని నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయాలకు రూ.1.50లక్షలతో టేకు తలుపులను చేయించారు. ఈ మేరకు శనివారం వారు తలుపులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తీగల సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీరాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌లోని హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన షబ్బీర్ అహ్మద్ కుమారుడు ఇసాక్ అహ్మద్ (32) చెప్పుల షాపులో పనిచేస్తుంటాడు. శివరాంపల్లి – బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు ఢీకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

అల్వాల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. కానాజీగుడ అంబేద్కర్‌నగర్‌లో నివాసముండే పద్మ ఆర్థిక ఇబ్బందులలో ఉండడం తోపాటు వింత వింతగా ప్రవర్తిస్తుండేది. మనస్థాపానికి గురైన పద్మ ఒంటిపై కిరోసిన్ పోసుకొని శనివారం ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి అదృశ్యం



సాయిక్రిష్ణ

అల్వాల్: విద్యార్థి అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. కృపా కంప్లెక్స్ సాయిక్రిష్ణానగర్‌లో నివాసముండే టి. సాయిక్రిష్ణ (20) కాగా ఈ నెల 20వ తేదిన సిద్ది పేట్‌లోని శివంపేటలో ఉన్న పాలిటెక్నిక్ కాలేజీకి వెళ్తున్నానని ఇంట్లో సోదరికి చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికిన అతని ఆచూకి తెలియకపోవడంతో తండ్రి బీరప్ప శనివారం నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీగా ఉన్న ఇళ్లను ఎరుకలకు కేటాయించాలి



డబుల్ ఇళ్ల సముదాయం వద్ద నిరసన తెలుపుతున్న ఎరుకల కులస్తులు

మన్సూరాబాద్: ఎరుకల నాంచారమ్మ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాల్లో ఖాళీగా ఉన్న ఇళ్లను ఎరుకల కులస్తులకు కేటాయించాలని ఎరుకల గిరిజన అభివృద్ధి సేవా సంస్థ నేతలు వనం గంగయ్య, నాంచారమ్మ కాలనీ అధ్యక్షుడు జగన్నాథం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు నాగోలు డివిజన్ పరిధిలో ఉన్న సదరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద అర్హులైన ఎరుకల కులస్తులతో కలిసి శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంగయ్య, జగన్నాథంలు మాట్లాడుతూ, మన్సూరాబాద్ గ్రామ సర్వే నంబర్ 5, 4ల్లోని ప్రభుత్వ స్థలంలో రెండు బ్లాకుల్లో 288 డబుల్ ఇళ్లను నిర్మించారన్నారు. అన్ని వర్గాలకు చెందిన 200 కుటుంబాలకు ఇళ్లను కేటాయించగా వారు నివాసం ఉంటున్నారన్నారు. కాగా, బీ బ్లాక్‌లో ఖాళీగా ఉన్న 88 డబుల్ ఇళ్లను అక్కడే నివాసముంటున్న ఎరుకల కులస్తులకు కేటాయించాలన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్, రెవెన్యూ అధికారులకు విన్నవించామని తెలిపారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని అర్హులైన ఎరుకలకు ఈ ఇళ్లను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సిద్దిని స్వామి, వనం యేసు పలువురు మహిళలు పాల్గొన్నారు.

తెచ్చింది రూ.9 కోట్లు.. ఖర్చు చేసింది రూ.3 కోట్లు

- మిగిలిన రూ.6కోట్లు ఎక్కడ?
- ఆర్టీఐ ఆధారాలతో మంత్రిని ప్రశ్నించిన అందెల

బడంగ్‌పేట్: అభివృద్ధి పేరుతో కారెక్కిన విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు డిమాండ్ చేశారు. శనివారం నాదర్‌గుల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆర్టీఐ ద్వారా సేకరించిన సీడీపీ, ఎస్‌డీఎఫ్, సీబీఎఫ్ నిధుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృది పథకం (సీడీఎఫ్) కింద రూ.9 కోట్లు మంజూరు అయితే రూ.3 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. మిగిలిన రూ.6 కోట్లు ఏమయ్యాయని మంత్రిని ప్రశ్నించారు. స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద నాలుగేళ్లల్లో రూ.1.7కోట్ల నిధులు మంజూరైతే కేవలం రూ.44.90లక్షలతో పనులు చేపట్టారన్నారు. కృషియల్ బ్యాలెన్సింగ్ ఫండ్(సీబీఎఫ్) కేవలం రూ.20 లక్షలు మాత్రమే తెచ్చారన్నారు. కేవలం మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో శిలాఫలకాలు వేస్తూ మంత్రి సబితారెడ్డి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. నేను వెల్లడించిన లెక్కల కంటే ఒక్క రూపాయి ఎక్కువ తెచ్చిన నియోజకవర్గం నడిబొడ్డున ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. నియోజకవర్గం నుంచి వేలకోట్ల టాక్సులు, రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని గజ్వేల్, సిద్ధిపేట్, సిరిసిల్ల నియోజకవర్గాలకు ఖర్చు చేస్తుంటే సబితారెడ్డి ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ వద్ద మాట్లాడే ధైర్యం ఆమెకు లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. త్వరలో అన్ని డివిజన్లు, మండలాలు, మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లో ఎంత అభివృద్ధి చేశారనేది ఆర్టీఐ ఆధారాలతో నియోజకవర్గం అంతా కలియ తిరిగి ప్రజలకు వివరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ శ్రీధర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, తుక్కుగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శివకుమార్, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అందెల శ్రీరాములు యాదవ్

పార్క్ స్థలాలను కాదు.. ప్రజా సమస్యలను గుర్తించండి

సామ రంగారెడ్డి

లింగోజిగూడ: ఎమ్మెల్యే మార్నింగ్ వాక్‌లో పార్క్ స్థలాలను కాదు... ప్రజా సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. శనివారం లింగోజిగూడ డివిజన్‌లోని ధర్మపురి కాలనీలో సామ రంగారెడ్డి పర్యటించారు. కొంతకాలంగా ఈ కాలనీ సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతోందని అన్నారు. గత వర్షాకాలంలో ఈ కాలనీ మొత్తం నీట మునిగిందని, అప్పటినుంచీ ఈ కాలనీ సమస్యలు తీర్చే నాథుడే కరువయ్యాడని ఆయన అన్నారు ఇప్పటికీ డ్రైనేజీ పొంగుతున్నా.. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడని అన్నారు. తాగునీరు లేక ఆరు నెలలు అవుతున్నా... అధికారులు, స్థానిక ఎమ్మెల్యే గానీ పట్టించుకోవడం లేదన్నారు.. వర్షాకాలం రాకముందే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో డ్రైనేజీ, మంచి నీటి సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని అధికారులను రంగారెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో రాకేష్ యాదవ్, ఎన్‌పీ శాస్త్రి, దేవేంద్ర వరప్రసాద్, విజయ్ భాస్కర్, కృష్ణంరాజు, గట్టు రవి, కిరణ్, నాగరాజు, కృష్ణ గౌడ్, అశోక్, ప్రశాంతి పాల్గొన్నారు.



ధర్మపురి కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న సామ రంగారెడ్డి